క్లుప్తంగా

అప్పన్నకు బంగారు హారం బహూకరణ



ఈవో శ్రీనివాసమూర్తికి బంగారుహారం అందజేస్తున్న దాత సూర్యచంద్రరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నగరంలోని మధురవాడ ప్రాంతానికి చెందిన కె.సూర్యచంద్రరావు అనే దాత 350 గ్రాముల బంగారు హారాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు. అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, వీబీవీ రమణమూర్తి, ఏఈ హరి, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని బేడా వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

తహసీల్దార్ వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ వేణుగోపాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఆర్వోలు

పెందుర్తి: మండల తహసీల్దార్‌గా కె.వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే తమ ప్రధాన కర్తవ్యం అన్నారు.

సకాలంలో వినతుల పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 6 వినతులు అందాయి. జోనల్ కమిషనర్ హైమావతి ఆయా వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు అప్పగించారు. వినతులు పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అండర్-16 విజేత విశాఖ

విశాఖ స్పోర్ట్స్: అండర్ 16 మల్టీడే అంతర జిల్లాల మ్యాచ్‌ల ఫైనల్‌లో విశాఖ జట్టు 433 పరుగుల తేడాతో విజయం సాధించింది. నెల్లూరు వేదికగా మూడు రోజుల పాటు జరిగిన తుది పోరులో కృష్ణా జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు ఏడు వికెట్లకు 456 పరుగుల చేసింది. శ్రావన్ 113, రోహన్ 151 పరుగులతో సెంచరీలు నమోదు చేయగా ఈశ్వర్ 87 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్ సాయి సాత్విక్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా కృష్ణా జట్టు 148 పరుగులకే ఆలౌటైంది. భానుస్వరూప్ ఆరు వికెట్లు తీయగా గౌతమ్ రెండు వికెట్లు తీశాడు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన అవసరం

నూతన విద్యావిధానాన్ని అనుసరించి వారం రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం నాటి సహపంక్తి భోజనాలతో ముగిసింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు పాఠశాలలకు పండ్లు, స్వీట్లు, పులిహోర వంటి ఆహార పదార్థాలు అందించారు. వాటిని విద్యార్థులకు వడ్డించారు.

- డీఈవో వెంకటలక్ష్మమ్మ
- ముగిసిన శిక్షా సప్తాహ్

పరవాడ: భారతీయ సంస్కృతి,సంప్రదాయాలపై చిన్న వయసు నుంచే ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని.. సోదర భావాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ సూచించారు. పరవాడ బాలుర హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో విద్యార్థులు సంతోషంగా పాల్గొన్నారని చెప్పారు. దీని వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరగడంతో పాటు నూతన అంశాలపై అవగాన పెరుగుతుందన్నారు. ప్రభుత్వ అదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం పటిష్టంగా నిర్వహించామన్నారు.



పరవాడ బాలుర హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

ఘనంగా శుభదిన్ భోజన కార్యక్రమం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహాచల్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా సోమవారం శుభ తిథి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసినాయుడు శుభ తిథి భోజనం కార్యక్రమం లక్ష్యాన్ని వివరించారు. పండగలు, పుట్టిన రోజులు, వార్షికోత్సవాలు తదితర వాటిని పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో దాతలు పండ్లు, స్వీట్లు అదనంగా అందించడమే శుభ తిథి ఉద్దేశమన్నారు. దీని ద్వారా విద్యార్థులకు మరింత పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సద్వారపూడి భాస్కరరావు పుట్టినరోజు పురస్కరించుకుని ఆయనతో పాటు నిమ్మకాయల నూకరాజు అందించిన అరటిపండ్లు, లడ్డూలు విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు కె.ఝాన్సీ లక్ష్మీబాయి, కె. పూర్ణకుమారి, పి.రేఖ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అరటిపండ్లు, లడ్డూలు అందజేస్తున్న హెచ్‌ఎం సన్యాసినాయుడు తదితరులు



అల్పాహారం వడ్డిస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత, శంకర్రావు

శాంతినగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో..

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శాంతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉద్యాయులు సీతావరలక్ష్మి, అన్నపూర్ణేశ్వరి పాఠశాలకు సౌండ్ సిస్టమ్ సమకూర్చారు. విద్యార్థులకు అల్పాహారం అందించగా కార్పొరేటర్ శానాపతి వసంత, శంకర్రావు దంపతులు విద్యార్థులకు వడ్డించారు. హెచ్‌ఎం ఉప్పలూరి శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సమగ్రాభివృద్ధి

- నిధుల కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు ..
- భూ కబ్జాల విషయంలో ఎవరినీ ఉపేక్షించబోం
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎవరు ఉన్నా పార్టీలకు అతీతంగా ఆయా పల్లెలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు.నిధుల కొరత ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు నిధుల సమీకరణ కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతామన్నారు. పెందుర్తి మండల సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మధుపాడ నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ నిధులతో పాటు నియోజకవర్గంలోని పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు కూడా సమీకరిస్తామని చెప్పారు. ప్రజలకు మంచి చేసే విషయంలో ఏ ప్రజాప్రతినిధి, రాజకీయ నాయకుడు పంతాలకు వెళ్లవద్దని.. సమన్వయంతో ప్రజలకు మేలు చేయాలని సూచించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల పేర్లు చెప్పుకుని భూ కబ్జాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూ కబ్జాలు, వసూళ్ల విషయంలో ఎంతటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. సభ్యులు పలు అంశాలపై సమస్యలను ప్రస్తావించగా సంబంధిత అధికారులు సమాధానాలు ఇచ్చారు. తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎంపీడీవో రవికుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: మండలంలోని ముదపాక ఆర్ఆర్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర టెన్నిస్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను సోమవారం మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ క్రీడలకు తనవంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తానని చెప్పారు. క్రీడాకారులను పరియం చేసుకుని..కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గండి రవికుమార్, మధుపాడ అంజి, ఉగ్గిన గోవింద్, సారిపల్లి గణేష్, ముదపాక శివ, చిరికి దేముడు, మెంటి మహేష్, సియాద్రి బాలచంద్ర, రాయవరపు పైడిరాజు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక లేఅవుట్‌లపై ఫిర్యాదు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీలో అనుమతులు లేని లే అవుట్‌లపై చర్యలు తీసుకోవాలని ఇరువాడ గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు సోమవారం డిమాండ్ చేసారు.దీనిపై మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ఏవో బాబూరావు,ఈవోఆర్డీ మహేష్‌లకు ఆయన ఫిర్యాదు చేశారు. సబ్బవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 274, 20, 21 వంటి పలు నంబర్ల సబ్ డివిజన్‌లలో అనధికారిక లే అవుట్‌లు వేసి క్రయ విక్రయాలు చేపడుతున్నారని వివరించారు. గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా లే అవుట్‌లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



ఏవో బాబూరావుకు ఫిర్యాదు చేస్తున్న బలిరెడ్డి అప్పారావు

తేలికపాటి వర్షానికే జలమయం

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో సోమవారం సాయంత్రం కురిసిన తేలికపాటి వర్షానికే పలు చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. సబ్బవరం సాయినగర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైన్లు లేకపోవడంతో నీరు రోడ్లపై పొంగి ప్రవహించింది. దీనికి తోడు లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరుతో వర్షపు నీరు కలిసి ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. దీంతో వర్షం అనంతరం ప్రధాన రహదారులు మురికి వాడలను తలపిస్తున్నాయి.ఫలితంగా వాహనాలతో పాటు పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైన్లు ఏర్పాటు చేసే వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో నిలిచిన వర్షపు నీరు

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ తన బంగ్లా నుంచి బ్యాటరీ వాహనంలో జీవీఎంసీకి వచ్చారు. అనంతరం వారిద్దరు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించాలనే నిర్ణయం మేరకు జీవీఎంసీలో అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

రక్త నిల్వల జాబితా ప్రదర్శించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రక్త నిల్వల జాబితా, వివరాలు ప్రతి బ్లడ్‌బ్యాంకులో ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఉన్న బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులతో సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో కనీసం రెండు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన సమాచారాన్ని జిల్లా అధికారులకు ఇవ్వాలన్నారు. హెపటైటిస్-బి, సి పాజిటివ్ కేసులు, హెచ్ఐవీ, సిఫిలిస్ కేసుల వివరాలను వైద్య ఆరోగ్య శాఖకు పంపించాలని తెలిపారు. ముఖ్యంగా తలసేమియా కేసులకు ఉచితంగా రక్తం సరఫరా చేయాలని ఆదేశించారు. బ్లడ్ బ్యాంక్‌ల నిర్వహణకు లైసెన్స్, శిబిరాల నిర్వహణకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల కాలం కనుక తగిన స్థాయిలో ప్లేట్‌లెట్లను ప్రతి బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉంచుకోవాలన్నారు. ఏ ఒక్కరికి బ్లడ్ లేదంటూ నిరాకరించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్టు నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, సహాయ అధికారి ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్లు బద్రి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని పీపీపీకి ఇవ్వొద్దు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలనే కేంద్ర మంత్రి ప్రతిపాదనను విరమించుకోవాలని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పోర్టు హాస్పిటల్ ఎదురుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు హాస్పిటల్‌ను రూ.222.43 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు శుక్రవారం కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించారని, ప్రస్తుతం కైలాసపురంలో 80 పడకల ఆస్పత్రిని పీపీపీ భాగస్వామ్యంతో 300 పడకల హాస్పిటల్‌గా మార్చాలని ప్రతిపాదన చేశారని వివరించారు. వెంటనే దీనిని విరమించుకోవాలన్నారు. ఈ హాస్పిటల్‌పై ఆధారపడి 4 వేల మంది ఉద్యోగులు, అధికారులు, 13 వేల మంది పెన్షనర్లు ఉన్నారని, దీనిని పీపీపీకి ఇస్తే వీరందరికీ వైద్యాన్ని దూరం చేస్తారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెంటనే ఆపాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వి.ఎస్.పద్మనాభరాజు, సిటు నాయకులు బి.జగన్, బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతపై దృష్టి పెట్టాలి

పరవాడ: ఫార్మాసిటీలోని పరిశ్రమల్లో ఇటీవల జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు.స్మైలెక్స్‌తో పాటు మిగిలిన పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పూర్తిగా గాలికి వదిలేశారని ఆరోపించారు. స్మైలెక్స్ పరిశ్రమలో జరిగిన వరుస ప్రమాదాల్లో పెదగంట్యాడ, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన పలువురు కార్మికులు మృత్యువాత పడ్డారన్నారు. పరిశ్రమలో కార్మిక చట్టాలు అమలు చేయలేదం లేదని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతన చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. పరిశ్రమల్లో భద్రతపై ఆడిట్ నిర్వహించి ప్రమాదానికి కారకులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

'శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి'



మాట్లాడుతున్న శిష్ట కరణం అధ్యక్షుడు గోపీ


అగనంపూడి: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సహకారం అందించాలని శిష్ట కరణం అసోసియేషన్ కూర్మన్నపాలెం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ఎస్‌వి గోపాల్, డి.సత్యారావు కోరారు. వడ్లపూడి కాలనీలో సోమవారం నిర్వహించిన కూర్మన్నపాలెం కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డి.గురునాథరావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, కె.రవినాథ్, ఎన్.నాగభూషణం, రాము, కిషోర్ కుమార్, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాటిచెట్లపాలెం: రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం ముందు ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్-సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సెలవులు అమలుచేయాలని కోరారు. కాంట్రాక్టర్ మారితే ఉద్యోగులను తొలగించడం వంటివి చేస్తున్నారని, మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు.

రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఉక్కునగరం: రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్టీల్ ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. రహదారి నిబంధనలపై ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, హెల్పర్లకు స్థానిక డీపాల్ పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటో నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓవర్ లోడింగ్ లేకుండా పరిమితంగా ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. విద్యార్థులతో ప్రయాణం చేసేటప్పుడు అతి వేగం పనికి రాదన్నారు. ఇంటి నుంచి పాఠశాలకు తీసుకువచ్చి తిరిగి తల్లిదండ్రులకు అప్పగించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఉక్కునగరంలో గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.ఎస్.వి.మహాలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాదర్ అనీష్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ షాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



యోగా పోటీల్లో సత్తాచాటిన తానాం గురుకుల పాఠశాల విద్యార్థులతో హెచ్‌ఎం అప్పలనాయుడు



యోగా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం కనకేశ్వరరావు

పరవాడ: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖ జిల్లా సీతమ్మధార కృష్ణమందిర్‌లో ఈ నెల 28న జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.

- అండర్10-12 విభాగంలో జి.తేజశ్విని వెండిపతకం, తేజశ్రీ కాంస్య పతకాలు సాధించారు.
- అండర్12-14 విభాగంలో డి.హర్షిత బంగారు పతకం, బి.వైష్ణవి వెండి పతకం, ఎస్.కౌశిక కాంస్య పతకాలు, అండర్ 14-16 విభాగంలో కె.హరిత బంగారు పతకం, కె.భావన వెండి పతకం, కె.వెంకట వైష్ణవి కాంస్య పతకాలు సాధించారు.
- పతకాలు సాధించిన విద్యార్థులు సెప్టెంబరులో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు, యోగా శిక్షకుడు సీహెచ్.ఆంజనేయులు అభినందించారు.

వాడ చీపురుపల్లిలో..

యోగా పోటీల్లో అండర్14-16 విభాగంలో వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎస్.అభిరామ్ కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు అభిరామ్‌ను పాఠశాల హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, పీడీ బి.అన్నాజీరావు, కోచ్ ఆంజనేయులు సోమవారం పాఠశాలలో అభినందించారు.

ఉక్కు ఊపిరి తీయొద్దు

అగనంపూడి: వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ఊపిరి తీయొద్దని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జి.బోసుబాబు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1264వ రోజు, సోమవారం కార్యక్రమంలో వారు మాట్లాడారు. మూడున్నర సంవత్సరాల నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేస్తుంటే రోజురోజుకూ ఉక్కును ఇరకాటంలో పెట్టడం, ఉత్పత్తికి విఘాతం కల్గించడం చేస్తుండడంతో కార్మికులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షిస్తామని రాష్ట్రంలో నాయకులు హామీ ఇచ్చారని, ఆ మేరకు ఉక్కు పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస నాయుడు, దొమ్మేటి అప్పారావు, వరసాల శ్రీనివాసరావు, డేవిడ్, డి.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.



దీక్షలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

పీఎం సూర్య ఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కరపత్రం, పోస్టర్‌ను కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామమూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ ఎల్.మహేంద్రనాథ్, జీవీఎంసీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్